జ్యోతి కథల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన కథ

# అడ్డొచ్చిన కన్నీటి కెరటం

ఓలేటి బుజ్జిబాబు

తెల్లారితే భోగిపండుగ!

ఆకాశం నిర్మలంగా వుంది. మచ్చుకయినా తెల్లటి మబ్బుతునక లేకపోవడంతో—చలిగాలి విజృంభించి రివ్వున వీస్తోంది. ఆ సాయం సమయంలో వీధంతా శుభ్రంగా కడిగిన ముత్యంలా వుంది. ఇళ్ళన్నింటికీ సున్నాలు వేసి, కిటికీలకీ, ద్వారాలకీ రంగులురాసి, ద్వార బంధాలకి పసుపుపూసి కుంకుమబొట్లు పెట్టడం వల్ల—'కళకళ'లాడుతున్నాయి. ప్రతి యింటి ముందు కల్లాపి జల్లి రంగు రంగుల ముగ్గులు తీర్చిదిద్దబడ్డాయి. రెండువేపులా రంగవల్లికల మధ్య సన్నని తారురోడ్డు-మరీ నల్లగా అగుపిస్తూ మెరిసిపోతోంది. ఓ ఇంటి అరుగుమీద రెండు కుట్టుమిషన్లు దడదడలాడుతూ తిరుగుతున్నాయి జోరుగా!

వంట పూర్తిచేసేసి, టీ చేసి ఫ్లాస్కులో పోసి వీధి అరుగుమీద తీరుబడిగా కూర్చుంది అన్నపూర్ణమ్మ. చలిగా వుండడంవల్ల పైట చెంగును నిండుగా కప్పుకుంది. లైబ్రరీ నుంచి వచ్చే కూతురు సత్యకోసం రోజూ సాయంత్రం అలా ఎదురుచూడడం ఆమె దిన చర్యలో భాగంగా మారిపోయింది.

అలా కూతురుకోసం ఎదురుచూస్తున్న అన్నపూర్ణమ్మకి-ఎదిరింటి సుందరమ్మగారింటి ముందు రిక్షా ఆగడం, అందులోంచి సుందరమ్మ కూతురు పద్మ-భర్తతో, పిల్లల్తో పండక్కి-కన్నవారింటికి రావడం కనిపించింద. నవ్వుతూనే లేచి, గడప దిగి

"బాగున్నారా?" అంటూ పలకరించింది అన్నపూర్ణమ్మ.

"మీ దయవల్ల బాగున్నాం" అని పద్మ, ఆమె భర్తా నమస్కరిస్తూ అంటుంటే,

"నాదేముందమ్మా అంతా ఆ భగవంతుడి దయ!" అంటూ పిల్లల్ని ముద్దులాడింది అన్నపూర్ణమ్మ.

ఇంటిముందు రిక్షా ఆగడంతో, చేస్తున్నపని ఆపి గబగబా వస్తోంది సుందరమ్మ.

"సత్య బాగుందా అత్తయ్యగారూ?" అడిగింది పద్మ.

"బాగుందమ్మా."

"ఇంకా లైబ్రరీ నుంచి రాలేదా?"

"లేదమ్మా-దానికోసమే చూస్తున్నాను."

రిక్షావాలాకి డబ్బులిచ్చేసి సూట్ కేసూ, బ్రీఫ్‌కేసు పట్టుకుని నిలబడిపోయాడు పద్మభర్త.

"వెళ్ళమ్మా - ప్రయాణం చేసొచ్చారు. అబ్బాయి నిలబడిపోయాడు" అంది అన్నపూర్ణమ్మ. సుందరమ్మ మనవడ్ని [illegible] పక్క మనవరాలినింకో పక్క ఎత్తు[illegible] దారితీస్తుంటే—కూతురూ అల్లుడూ [illegible] అనుసరించడంతో, తిరిగి గడపలోకొచ్చిం[illegible] అన్నపూర్ణమ్మ.

అలా కూర్చుని ఆలోచనల్లో మునిగిన అన్నపూర్ణమ్మకి, ఇంకా పెళ్ళికాకుండా వుండిపోయిన కూతురు గుర్తుకు రావటంతో—పద్మ సంసారాన్ని చూసిన ఆనందం మరుగున పడిపోయి గుండె భారంగా కొట్టుకోసాగింది.

పద్మా సత్యా ఒకీడు పిల్లలే; కలిసి చదువు

కునేవారు. పద్మకి పెళ్ళయింది. ఇద్దరు పిల్లలు, మరి సత్య? ఇరవైమూడేళ్ళు నిండిపోతున్నా, తమ అసమర్థతవల్ల, ఆర్థిక దుస్థితివల్లా-కళ్ళు చెదిరేంత అందంగా వుండికూడా-కన్నెపిల్లగానే కాలం నెట్టుకొస్తోంది.

ఆ స్తిపాస్తులుండడంవల్ల-సుందరమ్మ మంచి సంబంధం చూసి కూతురుపెళ్ళి దివ్యంగా జరిపించేసింది. పెళ్ళయి నాలుగేళ్ళు గడిచినా, ప్రతిపండుగకీ కూతుర్నీ పిల్లల్నీ అల్లుణ్ణీ తనింటికి రప్పిస్తూ, పెట్టిపోతలు జరిపించి తన ముచ్చట తీర్చుకుంటోంది. కాస్త తీరికచిక్కి-నలుగురాడవాళ్ళూ ఒక గడపలో కూర్చున్నప్పుడు-ఎంతసేపూ తన కూతురి ముచ్చట్లు ఏకరువుపెడుతూ తెగ సంబరపడిపోతూ వుంటుంది!

ఇలా సత్యకూ పద్మకూ వున్న వ్యత్యాసం కొట్టొచ్చినట్టు కనబడ్డంతో—అంతరంగంలో పద్మ సంసారంపట్ల ఆమెకు తెలియకుండానే అసూయలాంటి పొర కమ్ముకోవటంతో గితుక్కుమంది అన్నపూర్ణమ్మ!

ఛ-ఛ ఇదేంవిటీ తనివాళ యిలా అయిపోతోంది? దానదృష్టం దానిది. పద్మ పచ్చగా వుంటే తనలో ఓర్వలేని తనంవెందుకు చోటు చేసుకోవాలి? పద్మ తన బిడ్డలాంటిది కాదా? తన దిష్టితగిలి పద్మ కష్టాలుపాలు కాకూడదు. భర్తతో పిల్లలతో పదికాలాలపాటు సంసారం పచ్చగా చేసుకోవాలి. భగవంతుడు వాళ్ళని చల్లగా చూడాలి. ఇలా అనుకుని, మనసు తేలిక పరుచుకుని, హాయిగా నిట్టూర్చింది అన్నపూర్ణమ్మ.

అదీ ఆమె సంస్కారం!

కూరలసంచీ చేతపట్టుకొని వస్తున్న భర్తను దూరంగా చూసి లేచి నిలబడింది. భర్తతో మాట్లాడి, కూతురి పెళ్ళికోసం అతను కదిలి పనిచేసేలా చేయాలని గట్టి నిర్ణయం తీసుకుందామె.

రామారావు యింటికి రావడంతో అతని చేతిలోని సంచీ అందుకొని లోనికిపోయి కూరలు సజ్జలో సర్దింది. భర్త పెరట్లోకెళ్ళి కాళ్ళు కడుక్కొని లోపలికొచ్చి తుడుచుకుని ఈజీ చైర్లో కూర్చోవడంతో, గ్లాసులో పోసి టీ అందించింది. భర్త టీ తాగి చుట్ట ముట్టించాక అతనికి చేరువగా కూర్చొని

"ఏంవండీ!"

"ఊఁ"

"సుందరమ్మగారి పద్మా పిల్లలూ అల్లుడూ పండక్కి వచ్చారండీ" అంది.

"ముప్పైఏళ్ళ కిందట నేనూ మీ వాళ్ళింటి కొచ్చేవాణ్ణి" నవ్వుతూ అన్నాడు రామారావు. కమ్మని టీ తాగాక ఘాటైన చుట్ట పీలుస్తున్నాడేమో-అతనికిప్పుడు మంచి హుషారుగావుంది. పైగా వాతావరణం చలిగావుంది. భార్య తనూ మాత్రవేం యింట్లో వుండడంచేత ఆ వయసులో కూడా అన్నపూర్ణమ్మ ఆకర్షణీయంగానే అవుపిస్తోంది! ఏభై ఎనిమిదేళ్ళ వయసు పాతికేళ్ళ హుషారు నందుకొంది.

భర్త మాటలకి చోద్యంగా చూస్తూ కాస్త చిరాగ్గా—


"బాగుంది బాగుంది. ముసలికాలానికి ముచ్చట్లనీ మా బాగుందండీ మీ వరుస. అప్పటి ఊసులెందుగ్గానీ—అమ్మాయి పెళ్ళి విషయం పట్టించుకోరేం?" లోలోపల మండుకొస్తుంటే చురుగ్గానే అసలు విషయాని కొచ్చింది అన్నపూర్ణమ్మ.

రామారావు ఊహలకి కాస్త అంతరాయం కలిగింది!

"ఏం చెయ్యమంటావే సంబంధం కుదరొద్దూ? కాగడా పట్టుకుని వెతుకుతున్నా కరువైపోతున్నారు పెళ్ళికొడుకులు" తాపీగా జవాబిచ్చాడు.

"అలాగని ప్రయత్నాలు చెయ్యడం మానుకుంటావుంటండీ? చేసుకున్నమ్మకి చేసుకున్నంతాని మన తాహతుకి తగ్గ సంబంధం తెచ్చి దాని పెళ్ళి జరిపించెయ్యాలిగానీ ఇలా నిశ్చింతగా కాలం గడిపేస్తుంటే ఎలా?" నిష్ఠూరంగా అంది అన్నపూర్ణమ్మ. ఆమె గొంతులోని తీవ్రతను గమనించి మౌనంగా చుట్ట కాలుస్తూ ఉండిపోయాడతను! కొద్ది క్షణాలు ఊరుకొని

## రచయిత గురించి



జనవరి ఒకటి పంథొమ్మిది వందల ముప్ఫయ్యేడులో పార్వతీపురంలో పుట్టేను. అక్కడే టీచర్‌గా పని చేస్తున్నాను. భార్య కస్తూరిబాయ్, అబ్బాయి సుధాకర్.

ప్రధానంగా నాటక రంగానికి చెందిన వ్యక్తిని. గత ఇరవయ్యేడేళ్లగా నాటక రంగంలో దీక్షతో చేసిన కృషికి గుర్తింపుగా—ఉత్తమ నటునిగా, ప్రయోక్తగా, సహనటీనటుల సమిష్టి కృషికి ప్రతిఫలంగా "ఉత్తమ ప్రదర్శనల"కు ప్రథమ బహుమతులను ఆంధ్ర, ప్రవాసాంధ్రల్లో జరిగిన నాటక పరిషత్తుల్లో అనేక పర్యాయాలు అందుకున్నాను. మా నాటక సంస్థ "చైతన్య కళాస్రవంతి."

గతంలో కొన్ని గేయాలు విశాలాంధ్ర, ఆంధ్ర ప్రభలలో ప్రచురితమయ్యాయి. మూడు నాటికలు, ఓ నాటకం రాసేను. తమ్ముడు శ్రీనివాసరావుభానుతో కలిసి ఈ మధ్యే మరో నాటిక రాసేను. ఇప్పటి వరకు నేను రెండే రెండు కథలు రాసేను. మొదటి కథ "దాహం" విజయ ప్రచురించింది. "అడ్డొచ్చిన కన్నీటి కెరటం" నా రెండో కథ. రెండో కథకి రెండో బహుమతి వచ్చింది. క్లుప్తంగా ఇదీ నా పరిచయం.

కథకి ద్వితీయ బహుమతి ఇచ్చిన న్యాయనిర్ణేతలకు, పోటీపెట్టి ప్రచురిస్తూ ప్రోత్సహిస్తున్న "జ్యోతి"కి నా కృతజ్ఞతలు.

---

అన్నపూర్ణమ్మ మళ్ళీ అందుకుంది.

"నా మాట కాస్త చెవిని పెట్టండి. మనమ్మాయి ఈడువాళ్ళందరికీ పెళ్ళిళ్ళయిపోయి ఇద్దరేసి ముగ్గురేసి పిల్లల్ని కూడా కంటూ హాయిగా సంసారాలుచేసుకుంటున్నారు. దానికన్న చిన్నపిల్లల కూడా పెళ్ళిళ్ళయి, నెలలు తప్పి గాజులు పెట్టించుకుంటున్నారు. యింకా పస్తాయిస్తూ కూర్చుంటే దానిపెళ్ళి చెయ్యడం మనవశం కాదు. పైగా అమ్మాయిని చూడండి అరబ్బీగుర్రంలా యెలా పెరిగిపోయిందో...."

"నీ పోలికే దానీనూ! ఆ వయస్సులో నువ్వెలా వుండేదానివో నా కిప్పటికీ జ్ఞాపకం వుంది...."

"చాలు చాల్లెండి సరసం. అయినా యీ వయసులో మీకివేం ఊహలండీ? పిల్లదాన్ని గురించి ఆలోచించండి బాబూ అని మొత్తుకుంటుంటే మనరోజుల ముచ్చట్లు తలచుకుంటూ లొట్టలేస్తారేం?"

"లొట్టలెయ్యడం కాదు పూర్ణా....యివాళెందుకో నాకా గతం అంతా గుర్తుకొస్తోందే... నీకు గుర్తుందా? మన పెళ్ళయిన మొదటి సంవత్సరం పండుగ ముందురోజున మీ వాళ్ళ యింటి వాకిట్లో నువ్వు ముగ్గుశేస్తుంటే నే నొచ్చాను. నన్ను చూసి సిగ్గుతో నువ్వు లోపలికి

తుర్రు...." అతని మధురస్మృతులకు ఆటంకంగా ఆ యింటిముందు పదిమంది పిల్లలు చేరి

"భోగీమంట—పొయ్యిలో కర్ర

ఇచ్చినమ్మకి పుణ్యం-ఇవ్వనమ్మకి పాపం" అంటూ కోరస్‌గా అరుస్తున్నారు. రామారావూ అన్నపూర్ణమ్మా మౌనంగా అలా వుండిపోవటంతో పిల్లలు రెచ్చిపోతూ "ఇచ్చినమ్మకి పుణ్యం—ఇవ్వనమ్మకి పాపం—పాపం...."

"వెళ్ళే—ఓ కర్రపేడు వాళ్ళకి పడేసి పుణ్యం కట్టుకో-లేకపోతే రాత్రికి పెరటిగోడ గెంతి తడకలు పట్టికెళ్ళి భోగీమంటల్లో తగలేస్తారు!" అన్నాడు రామారావు. అన్నపూర్ణమ్మ పెరట్లో రెండు కట్టెలు తెచ్చింది. ఆ గుంపులో కొంచెం పుష్టిగావున్న కుర్రాళ్ళిద్దరు పొడుగాటి వెదురు దండెల్ని దండీలుగా పట్టుకున్నారు. వీధిలోని ప్రతి యింట్లోవాళ్ళూ తెచ్చివేస్తున్న కర్రలు ఆ దండీలమీద వున్నాయి. అన్నపూర్ణమ్మ కూడా కర్రలు వెయ్యడంతో వాళ్ళు ఉత్సాహంగా అరుచుకుంటూ ముందుకు సాగిపోతున్నారు.

ఆమె ఇంట్లోకొచ్చి—

"చూడండీ! మనకా కాలం చెల్లిపోతోంది. మనం కాస్త "హరీ" అనకముందే దానికి పెళ్ళి చేసెయ్యాలి. లేకపోతే మనకి పుట్టగతులుండవండీ" అంటూ మళ్ళీ ప్రారంభించింది. ఆమెగొంతు జీరపోవడం గమనించి మౌనంగా వుండిపోయేడు రామారావు. ఇద్దరిమధ్యా నిశ్శబ్దం రాజ్యంచేస్తోంది.

"ఏవిటండీ బెల్లంకొట్టిన రాయిలా అలా వుండిపోయారు? మాట్లాడరేం??"

"చూద్దాం చూద్దాం."

"ఆ మాట మీరంటూ వుండడం నే వింటూ వుండడం చాలా కాలంగా జరుగుతోంది."

"నన్ను కాస్త స్థిమితంగా ఆలోచించుకోనియ్యే."

"మీరు స్థిమితంగా ఆలోచిస్తూ కూర్చుంటారని అమ్మాయి వయస్సు పెరక్కుండా అక్కడే ఆగిపోతుందా?"

ఇరకాటంలో పడ్డాడు రామారావు. అన్నపూర్ణమ్మ యివాళతన్ని విడిచిపెట్టేట్టులేదు. ఏంచెప్పి తప్పించుకుందుకీ అతనికి తోచడం లేదు. ఇంతలో పక్కింటి వాళ్ళమ్మాయి శారద "సత్య వచ్చిందండీ?" అంటూ లోనికి రావడంతో నిండుగా ఊపిరి పీల్చుకున్నాడు.

"లేరమ్మా-ఏం" అడిగింది అన్నపూర్ణమ్మ.

"అబ్బే—ఏం లేదండీ మా వారొచ్చారుగా! ఊళ్ళో మూడు సినిమాలు చూసేసినవే! అతనికిక్కడ బోర్ కొడుతోందట! వచ్చేటప్పుడు ఏవైనా కొత్తపుస్తకాలు తెమ్మని పొద్దున సత్యతో చెప్పాను. తెచ్చిందేమో అనొచ్చేను."

"అలాగా—తేగానే నీకిక్కేస్తాన్లే."

"మరిచిపోకండీ" అంటూ వెళ్ళిపోయింది శారద.

శారదను చూసేసరికి రామారావు మనస్సు మళ్ళా వెనక్కి పరిగెట్టింది. చుట్ట ఎర్రగా కాల్తోంది.

"పరువంతోవున్న పెళ్ళాన్ని పక్కన పెట్టుకుని బోర్ కొడుతోందట బోరు. నేనిలాగా అనేవాడ్నే మన రోజుల్లో? రాత్రీ పగలూ భేదాలెరక్కుండా మీ ఇంట్లోని ముందర గదిలో ముచ్చటగా గడిపేసేవాళ్ళం కదూ పూర్ణా? అబ్బే ఏం రోజులో ఏం కుర్రాళ్ళో...."

"చాల్చాలూరుకోండి మీరూ మీ ప్రతాపాలూనూ. మన అమ్మాయి యీడు ప్రతిపిల్లకీ పెళ్ళయి భర్తతో హాయిగా గడుపుతుంటే— కన్నకూతురి కన్నెచెర విడిపించాలన్న జ్ఞానం లేకుండా-గతాన్ని తల్చుకుని మురిసిపోతూ లొట్టలేస్తున్నారు సిగ్గులేకుండా."

భార్య మాటలతో నీరుకారిపోయేడు రామారావు. అంత చలిలోనూ బిందెడు చన్నీళ్ళు తెచ్చి నెత్తిమీద గుమ్మరించినట్టనిపించి కిమ్మనకుండా వూరుకున్నాడు. ఆమె మళ్ళీ అందుకుని,

"చూడండీ! మీ కేం మగమారాజులు. నలుగుర్లోనూ తలెత్తుకోలేక మధ్యన ఛస్తున్నాన్నేను. పెళ్ళాసు తలపెట్టకుండా దాని జీతంరాళ్ళ కోసం యిలా వదిలేస్తున్నావనీ నలుగురూ గుసగుసలకిపోతున్నారు. ఇదిగో మీకిప్పుడే చెబుతున్నాను. ఏదోలా చేసి తొందర్లోనే దాని



పెళ్ళి జరిపించకపోతే వూరుకునేది లేదు."

"ఎలా జరిపిస్తావేఁ? నీకు తెలియని సంచు లేవున్నాయి నా దగ్గర?"

"ఆ మాటనడానికి సిగ్గుపడండీ—కష్టపడి కూలీ నాలీ చేసుకుంటున్నవాడు కూడా కన్నె పిల్లకాగానే పెళ్ళి జరిపించేస్తున్నాడు; నా దగ్గరే వుందీ అని మీ లాగ కాళ్ళు తేలేసేడంలేదే?"

"మన బతుకులు వేరు. కాని వాళ్ళకలా కాదే; ఓ రెండొందలు పట్టుకుంటే చాలు—పెళ్ళయిందనిపించేస్తారు వాళ్ళు."

"పేదవాడి బతుక్కి నూర్రూపాలు సంపాదించడం కూడా మీరనుకుంటున్నంత తేలికేం కాదండీ. ఎంత చెట్టుకంత గాలన్నారు; మన తాహతుకి తగ్గ సంబంధం కోసం ప్రయత్నం చెయ్యండి."

"చేతిలో ఏం పట్టుకోకుండా ప్రయత్నంఁవేం చేస్తావేఁ?"

"చేతిలో సొమ్ము చేరాక ప్రయత్నం చేద్దావఁని కూర్చుంటే మరో జన్మకి దాని పెళ్ళి చేయలేం. అయినా ఆఁవిఁరి పోయివుంటే యిహ మీరుచేసే నిర్వాకం ఏవిఁటి?"

ఆరిపోయిన చుట్టను వీధిలోకి విసిరేసొచ్చి కొత్తచుట్టను ముట్టించాడు. అతనికేం లంగరందటంలేదు. పట్టినపట్టు వదలకుండా భర్త చేత సరే అనిపించాలని ఆమె కూర్చుంది.

"చూడండీ; ఈ యింటిమీద నాలుగువేలో అయిదువేలో అప్పు తీసుకురండి. దాంతో పెళ్ళి జరిపించేద్దాం."

మధ్యతరగతి మనిషి బ్రతుకులోని భయం అతని కళ్ళల్లో లీలగా దోబూచులాడుతోంది. వృద్ధాప్యంలో తమ జీవితాలు సాఫీగా సాగిపోయే రెండు కిటుకుల్ని కనిపెట్టి వాటిని తన గుండెలోపలి అరల్లో గుంభనంగా దాచుకున్నాడు రామారావు. అందులోని ఓ కిటుకు తనకు కాకుండా పోవడంతో మొదటి దానికీ రెండోదానికీ పరస్పరం బంధం వుండడంతో అతనికి కోపం వచ్చింది మరి.

"ఇంటిమీద అప్పుతీస్తే తీర్చేదెలా? నీకేమైఁనా మతిపోతోందా?"

"నిజవేఁసండీ మతిపోతోంది దాన్నలా చూస్తూంటే...." వస్తున్న కన్నీళ్ళు తుడుచుకుంటోందామె. తన పథకం పునాదుల్తో కదిలిపోతుంటే అతనిలో అసహనం చిందులేస్తోంది.

"ఏడాదికి రిటైరయిపోతానన్న దగ్గర్నుంచీ 'ఇల్లు బాగు చేయించండీ' అంటూ సతాయించి చంపేసేవు. వచ్చిన ప్రావిడెండ్ ఫండంతా ఇంటి మరమ్మత్తులకే హరించిపోయింది. నేను వెలగబెట్టిన వుద్యోగానికి ఓ పెన్షనుందా పాడా? ఇప్పుడీ ఇల్లు అమ్మేసి దాని పెళ్ళి చేసేస్తే ఎక్కడుంటాం; ఏం తింటాం? ఈ వయస్సులో పనులు పడుకుంటూ చెట్లకింద బికేద్దావాఁ? ఏవిఁటి నీ ఉద్దేశం?" చాలా తీవ్రంగానే అడిగేడు రామారావు.

"అయితే దాని పెళ్ళి పెటాకులూ జరిపించకుండా అలాగే వుంచేద్దావఁనా మీ ఉద్దేశం" అంత తీవ్రంగానూ భర్తనడిగిందామె; భర్త వైఖరి చూస్తుంటే ఆమెకు అనుమానంగానూ అయోమయంగానూ వుంది.

ఇహ తీర్పు చెప్పేసె సమయం వచ్చేసిందనుకున్నాడు రామారావు.

"చూడు పూర్ణా; నీకూతురేం నువ్వనుకుంటున్నంత ముదిరిపోలేదు; బరితెగించేసి తిరగడవూఁలేదు. పెద్దపెద్ద చదువులు చదువుకుంటున్న అమ్మాయిలు ముప్ఫయ్యేళ్ళొచ్చేసినా పెళ్ళి కాకుండా వేలాదిమందున్నారు దేశంలో. ఆ ఘడియ దానికింకా రాలేదు. కళ్యాణం వచ్చినా కక్కొచ్చినా ఆగదంటారు. ఈ లోగా నువ్వెంత మొత్తుకు చచ్చినా ప్రయోజనం వుండదు; ఇక నోరు మూసుకో" అంటూ విసురుగా లేచి ఆఖరిదమ్ము లాగి చుట్ట వీధిలోకి విసిరొచ్చి కూర్చున్నాడు. అంతే!

జీతంకోసం ఆశపడి ఆడపిల్ల పెళ్ళి జరిపించడం లేదని గుసగుసలకు పోతున్న అమ్మలక్కల తీరుకన్నా—కన్న కూతురి సుఖం కన్నా తమ బ్రతుకే ముఖ్యవఁని యింత ఖచ్చితంగా తేల్చిచెబుతున్న భర్త వైఖరి ఆమెకు మరీ బాధని, దుఃఖాన్ని కలిగిస్తోంది. లోకం అలా అనుకోవడంలో ఇప్పుడామెకు తప్పుగా అనిపించడంలేదు. కన్నీటికి అడ్డుకట్ట వెయ్యడం ఆమెకు శక్యం కాకుండా వుంది.




ముందు పుట్టిన ముగ్గురు మగబిడ్డలూ అల్పాయుష్కులై, పుట్టిన మూడునెలలకే గతించగా ఆఖర్ని పుట్టి, బట్టకట్టిన ఈ కూతురి బతుకు ఇంత వైభవంగా వెలిగిపోతున్నందుకు కంట తడిపెడుతూ మౌనంగా రోదించడం ఆమె వంతయింది.

వారిద్దరి మధ్యా కొన్ని క్షణాలు యెన్నో యుగాల్లా గడుస్తున్నాయి.

వీధిలో సత్యగొంతు వినిపిస్తోంది. పక్కింటి వాళ్ళమ్మాయి శారదతో మాట్లాడుతోంది. గొంతు తగ్గించి రామారావు హెచ్చరించాడు.


"అనవసరంగా రాద్ధాంతం చెయ్యకు; అమ్మాయి వచ్చేసింది? ఇహ నీ శోకాన్ని కట్టిపెట్టి వెళ్ళి ముఖం కడుక్కో. నిన్నలా చూసిందంటే అది తినే తిండి కూడా తినదు" అలా హెచ్చరించడం కూతురుపట్ల అనురాగమో, అవశరమో, తేల్చుకోలేక కళ్ళొత్తుకుని, పెరట్లో కెళ్ళి ముఖం కడుక్కొచ్చి భర్త ఆజ్ఞను పాటించిందా ఇల్లాలు.

పుస్తకాలూ, పేకెట్లూ పట్టుకొస్తున్న కూతురు కెదురెళ్ళి "ఇంతాలస్యం అయిందేమమ్మా?" అడిగింది అన్నపూర్ణమ్మ; తన వదనంలో విషాదరేఖలు కనిపించకుండా గట్టి ప్రయత్నమే చేస్తోందామె.

"పండక్కదమ్మా—మూడ్రోజులు సెలవలొస్తున్నాయిగా. పాత పుస్తకాలిచ్చేసేవాళ్లూ కొత్త పుస్తకాలు తీసుకెళ్ళేవాళ్ళూ—ఇలా చాలా పని తగిలిందమ్మా. లైబ్రరీ కట్టేసి, టైలర్ దగ్గరకెళ్ళి నాన్నగారి లాల్చీ, మన జాకెట్లూ పట్టుకొచ్చేసరికి ఈ వేళయింది. ఇదిగో నాన్నారూ మీ షర్టు. తొడిగి చూడండి. పండగ తొందరలో యెలా కుట్టాడో ఏమో" కూతు రందించిన పేకెట్ విప్పి కొత్త షర్టును తేరపార చూసి—తను వేసుకున్న లాల్చీమీదే కొత్త షర్టు సర్దుకుని—

"బావుందమ్మా—బాగానే కుట్టేడు" అంటూ మురిసిపోతున్నాడు. భర్త ముఖంలో వెల్లివిరుస్తున్న ఆనందాన్ని అదోలా చూస్తోంది అన్నపూర్ణమ్మ. అతని ప్రవర్తన ఆమెకు ఆశ్చర్యకరంగానూ, అసహ్యంగానూ వుండడంతో కూతురు చేతిలోని పుస్తకాలూ, పేకెట్లూ అందుకొని అలమారాలో దాచిందామె.

సత్య పెరట్లో కెళ్ళి కాళ్ళూ చేతులూ కడుక్కొచ్చి ఒణికిపోతూ, "అబ్బ—ఎంత చలిగా వుందో" అంటూ తల్లి యిచ్చిన టీని అందుకుంది. సత్య టీ తాగుతుంటే అన్నపూర్ణమ్మ గబగబ కుంపటి రాజేసి తండ్రీ కూతుళ్ళ మధ్య వుంచింది. వేడి వేడి టీ తాగి వెచ్చగా చలి కాగుతూ తండ్రితో కబుర్లలో పడి కాలం



గానే గతుక్కుమంది సత్య. ఒకడు ప్రోజెక్ట్ కంట్రాక్టర్ కొడుకు. మరొకడు మాజీ ఎమ్మెల్యే సుపుత్రుడు.

ఆ యిద్దరూ కలిసి చేసిన ఘనకార్యాలు ఆ ఊరందరికీ తెలిసినవే.

బలిష్టమయిన నల్లని ఎలుగ్గొడ్డుకు తెల్లటి బట్టలు తొడిగినట్టుంటాడు మొదటివాడు. అంత లేసి చెంపలతో పెద్ద మీసాలతో, పిల్లి కళ్ళతో ఎఱ్ఱ బిందువలా వుంటాడు రెండోవాడు.

వచ్చినవాళ్ళు ఆ పుస్తకం కాదీ పుస్తకం తెమ్మని, ఈ పత్రిక కాదా పత్రి కిమ్మని లేని అథారిటీ చెలాయిస్తూ—గడగడ మాట్లాడుతూ, అవసరం లేకపోయినా తనను మాటిమాటికీ మాట్లాడిస్తూంటే తనకి ఒంటిమీద గొంగళీలు పాకుతున్నట్లనిపిస్తోంది. వాళ్ళ వాలకాలు చూస్తోంటే అక్కడికి చదువుకోడాని కొచ్చిన ట్టనిపించలేదు తనకి.

"లైబ్రరీ మూసే వేళయింది. మీకేవైనా నవల్స్ కావాలంటే చెప్పండి" అంటూ పేపర్లు పుస్తకాలు సర్దేసి బీరువామీద వుంచిన పెద్ద తాళంకప్పని టేబిల్‌మీద పెడుతూ అడిగింది తను.

ఎలుగుబంటి దొంగచూపులు చూస్తుంటే ఎఱ్ఱ బిందు కళ్ళు మరీ ఎఱ్ఱగా మెరిసిపోతూ మింగేసేలా చూస్తుంటే వణుకు పుట్టుకొస్తోంది తనకి.

"మీరే కావాలి!"

"వాట్?"

"అనే నవలుందా?" ప్లేటు మార్చి అతి తెలివి ప్రదర్శిస్తున్నాడు ఎలుగుబంటి. పిల్లి కళ్ళ యెఱ్ఱ బిందువ తన వంక పులిలా చూస్తున్నాడు.

"లైబ్రరీలో ఏయే పుస్తకాలున్నాయో ఆ రిజిస్టర్‌లో వున్నాయి. నన్నడగడం అనవసరం" సాధ్యమైనంతవరకూ భయాన్ని కోపాన్ని అణుచుకుంటూ చెప్పింది తను.

ఎలుగుబంటి కంగుతిన్నాడు. ఎఱ్ఱబిందువ వేపు చూసేడు. వాడికి లౌక్యం తెలీదులా వుంది; డైరెక్టుగా రంగంలోకి దిగి—

"చూడు పిల్లా నువ్వంటే మా కిష్టం. నీ కెంత డబ్బు కావాలన్నా యిస్తాం. మాతో ట్రావెలర్స్ బంగ్లాకి రావాలి. వస్తావ్ కదూ?" అంటూ తన చెయ్యి పట్టుకున్నాడు. పురుగుని విదిలించినట్టు వాడి చెయ్యిని విసిరేసి రెండో చేత్తో వాడి చెంప 'ఛెళ్ళు' మనిపించింది తను. తెల్లబోయి తేరుకోలేక పోయాడు యెఱ్ఱ బిందువ.

వెనకనుంచి ఎలుగ్గొడ్డు తనని ఛల్లాకపట్టు

పట్టాడు. పెనుగులాడుతూ చేతికందిన తాళం కప్పతో వాడి నెత్తిన దభీ దభీమని బాదేసింది తను. రక్తం చివ్వున చిమ్మడంతో మూలుగుతూ తన నొదిలేసి కూలిపోయాడు వాడు. ఎలుగుబంటి తెల్ల బట్టలనిండా, లైబ్రరీ నేల అంతా ఎర్రటి రక్తం పారడంతో తనకి భయం పట్టుకుంది. ఆ రక్తం కన్నా మరింత ఎర్రగా వున్న ఎర్రబిందువ చూపులు తనను భయపెడుతున్నాయి. పరుగు లంకించుకొంది. వరండామీద తనను వెంబడిస్తూ "మర్డర్ మర్డర్" అని అరుస్తున్నాడు ఎర్రబిందువ. అతనికి తోడుగా కొన్ని గొంతులు జత కలిసేయి. మరి కొన్ని జతల కాళ్ళు పరుగులు తీసేయి, పరుగు—ఒకటే పరుగు. గొంతు ఎండిపోతోంది. గుండె లవిసిపోతున్నాయి. నీరసం ఆవహిస్తోంది. శరీరంలో శక్తినంతా కూడదీసుకొని పరుగెడుతోంది తను. నాలుక పిడచకట్టుకు పోతోంది. భయం — పరుగు —పరుగు—పరుగు—ఎలుగ్గొడ్డు—తాళం దెబ్బ—రక్తం—చావు—ఖద్దరు లాల్చీలు—పొడుగు జేబులు—కాకీ బట్టలు—ఎర్రటోపీలు—నల్లకోట్లు—జైలు—ఉరి—అమ్మో ఉరి. పోవాలి—తప్పించుకోవాలి. వెనకాల జనం—కేకలు—అదిగో వీధి—అల్లదిగో ఇల్లు. జోగిపోతూ ఇంటికి చేరి తలుపులు మూసి గడియ బిడాయించేసి—హమ్మయ్య—కుప్పగా కూలిపోయింది తను—దాహం—దాహం—వీధిలో జనం—కేకలు—వీధిలో—దాహం—ఇంట్లో....

తెలివొచ్చింది సత్యకి. బయట కేకలు లీలగా వినపడుతున్నాయి. పూర్తిగా తెలివి తెచ్చుకుంది తను. పాడు కల. ఎంతగా భయపెట్టింది తనని. బయట భోగీమంటలు వేస్తున్న కుర్రాళ్ళ కేకలవి. గొంతు తడారిపోయింది. నీళ్ళు తాగితేగాని దాహం కట్టేలా లేదు. గదంతా కటిక చీకటి. తడుముకుంటూ అలవాటుగా వెళ్ళి స్విచ్ వేసింది.

ఎదురుగా అగుబడ్డ దృశ్యాన్ని చూసి కొయ్యబారిపోయింది సత్య. మంచమ్మీద రామారావు, అన్నపూర్ణమ్మా ఇంచుమించు దిగంబరంగా వున్నారు.

కూతురు కళ్ళలోకి క్షణంలో సగంసేపు చూసింది అన్నపూర్ణమ్మ. ఆ కళ్ళలో శతకోటి భావాలు. అన్నపూర్ణమ్మకి తన తలని పాతాళాల్లోనికి బలంగా కుమ్మేస్తున్నట్టు అనిపించింది. తేరుకుంది. చేష్టలుడిగి ఆయాసపడుతూ అలాగే వుండిపోయిన భర్త ముఖంమీద పిడికిలితో పొడిచి, కూతుర్ని చూడలేక ముఖాన్ని రెండో వేపు తిప్పేసుకుందామె! రామారావిప్పుడీ లోకంలో కొచ్చి, బట్ట సర్దుకుని, దుప్పట్లో తల దూర్చేసేడు! ఆ తరువాతే చైతన్యం వచ్చిన సత్య చటుక్కున లైటార్పేసింది.

ఇదంతా కొద్దిక్షణాల్లో జరిగింది.

పక్కమీదకి రెండంగల్లో దూకి దుప్పటి కప్పేసుకుంది సత్య. ఆమెకు మతి పోయినట్లయిపోతోంది. ఛీఛీ—ఎంత పని చేసింది తను! వాళ్ళనాస్థితిలో చూస్తూకూడా తనలా నిలబడిపోయిందేవిఁటి? ఛీఛీ వెధవ కల—వెధవ దాహం—బాగా వచ్చిపడ్డాయి. తెల్లారితే పండగ! వాళ్ళనెలా చూస్తుంది తను? తనతో వాళ్ళెలా మెసలుతారు!

అయినా యీ వయస్సులో కూడా అమ్మా నాన్నా....

ఇంత బాధలోనూ ఆమె నరాలు జివ్వున లాగేస్తున్నట్టూ, ఏదో కావాలనిపిస్తూ, శరీరం గాలిలో తేలిపోతున్నట్టూ, మతి పోతున్నట్టూ ఫీలాతోంది సత్య!

అవును! ఆ వయసుకది సహజం మరి!

ఇలా పరిపరివిధాలా మనసు పరుగెడుతుంటే—వీధిలోని పిల్లల కేకలు లీలగా వినపడుతుంటే—వాటిమధ్య సన్నని వెక్కిళ్ళు వినిపిస్తున్నాయి. ఊపిరి బిగబెట్టి, గట్టిగా కళ్ళు మూసుకుని చెవులకు పని కల్పించిందామె! వెక్కిళ్ళు ఎక్కువకాసాగాయి. అమ్మ ఏడుస్తోందని తెలుసుకుంది తను! నాన్న గొంతు గుసగుసగా ఏదో అంటున్నట్టు వినిపిస్తోంది తనకి. శరీరంలోని శక్తినంతా శ్రవణేంద్రియాల మీదే తను కేంద్రీకరించింది. మంచం కిర్రు

మంది — అమ్మ కాలిమట్టెలు చప్పుడౌతున్నాయి గచ్చుకు తగిలి—అమ్మ నడుస్తున్నట్టనిపిస్తోంది తనకి—పడకగది గడియ తీసిన చప్పుడు—మళ్ళీ నడుస్తున్నట్టు మట్టెల చప్పుడు—పెరటిగడియ తీసిన చప్పుడు—వెనక వీధిలో భోగీమంట వేస్తున్న కుర్రాళ్ళ అరుపులు పెద్దగా వినిపిస్తున్నాయి—చలిగాలి గదిలోకి రివ్వుమని ప్రవేశించింది-తల్లి అలికిడి లేదు. చల్లటి చలి—పెరట్లో పిల్లలకేకలు—అంతే తనకింకేం తెలియడం లేదు.

అమ్మ పెరట్లోకి వెళ్ళుంటుందా? ఏమైంతవుతుందో? తెల్లారిపోయిందేవిఁటో? లేచి వెళ్లి చూస్తే? అమ్మ మొహం తనిప్పుడెలా చూస్తుంది?

ఇలా పరిపరివిధాలా ఆలోచిస్తున్న సత్యకి నూతిలో ఏదో పడ్డట్టు పెద్ద శబ్దం వినిపించింది. తల్లి నీళ్ళు తోడుతుందేమో అనుకుంది. గిలక చప్పుడుగాని, చేదబడ్లకు తగులుతున్న శబ్దంగాని, వినబడకపోవడంతో ఆమెకు అనుమానం వేసింది. భయం పట్టుకుంది. దిగ్గునలేచి లైటు వేసింది. సమయానికి రామారావుకూడా లేచి కూర్చున్నాడు. కూతురి ముఖం చూసి తలవంచేశాడు.

“నూతిలో ఏదో చప్పుడైంది నాన్నా-రండి” అంటూ, పెరటి గదిలైటు, పెరట్లోలైటు వేసి పరిగెట్టింది సత్య. వెనక వీధిలోని ఎత్తుకు వేస్తున్న భోగీమంటల కాంతి, ఎలక్ట్రిక్ బల్బు కాంతి కలిసి పెరడంతా పగటిపూటలా వెలుగ్గా వుంది. పెరట్లో తల్లి కనబడలేదు. నూతిగట్టున లేదు. మరుగుదొడ్డి, స్నానాలకోసం తడికెలతో కట్టుకున్న గది ఆత్రంగా కలియజూసింది సత్య. వెళ్ళి నూతిలోకి చూసింది. నుయ్యంతా చీకటి గుయ్యారంలా వుంది. తండ్రి లోపలనుంచి తెచ్చిన టార్చిలైటు లాక్కొని నూతిలోనికి ఫోకస్‌చేసి “అమ్మా” అని పెద్దగా కేకేసింది సత్య. ఆమె చెయ్యి పట్టుజారి టార్చి నూతిలో పడిపోయింది. ఏడుస్తూ నూతి పళ్ళెమ్మీద కూలబడిపోయింది. ఆమె మెదడు మొద్దుబారింది.

రామారావు రోదిస్తూ పెద్ద పెద్ద కేకలేసి యిరుగు పొరుగు వారిని లాక్కొచ్చేడు. పది మందీ చేరేరు. అంతా గందరగోళం. ఔనని, కాదని తర్జనభర్జనలు. గబగబా తాళ్ళూ, నిచ్చెనలూ నూతిలోకి దిగేయి. అన్నపూర్ణమ్మను బయటకు తీసేరు. “చనిపోయిందని” కొందరు “కాదు బతకొచ్చని” కొందరు మళ్ళా తర్కించుకుని, పెరటి వసారాలో లైటు వెలుతురులో పడుకోబెట్టేరు. నీళ్ళు కక్కించే ప్రయత్నం చేసి, వృధాప్రయాసని తెలుసుకుని పెదవి విరిచేసారు.

సత్య యాంత్రికంగా లేచి, కళ్ళు తుడుచుకుంటూ వెళ్ళి తల్లి శవం దగ్గర కూర్చుంది. రామారావు వీధిగడపలోకి పోయి నోట గుడ్డ కుక్కుకుని కుమిలిపోతున్నాడు. ఇల్లంతా గోల, ప్రశ్నలు, ఊరడింపులు, రామరామలు, గుసగుసలు.

సత్య గుండెలాగే వెనుక వీధిలోని భోంగీమంట “భుగ భుగ”మని మండుతోంది. బల్బు కాంతి భోగీమంటల కాంతి కలగలిసి పోవడంతో అన్నపూర్ణమ్మ శవం వింతగా కనుపిస్తోంది. అరమూతగా వుండిపోయిన తల్లి కళ్ళల్లోకి చూస్తోంది సత్య.

“అమ్మా సత్యా! ఎదిగిన ఆడపిల్లకి పెళ్ళి చేసి అది పిల్లాపాపలతో హాయిగా కాపురం చేస్తోంటే నిండుగా ఆనందిస్తారమ్మా తల్లిదండ్రులు. కాని అలా వుంటే ఇక మా ప్రత్యేకత ఏవుంది? మమ్మల్ని చూసేవు కదమ్మా? కన్నెవయసులోని కూతురు కష్టపడి జీతం తెస్తోంటే నవరుచులూ కడుపారా తింటూ కొవ్వెక్కిన మమ్మల్ని కళ్ళారా చూసేవు కదమ్మా? చాలమ్మా ఈ బ్రతుక్కి. ఇంత జరిగేక కూడా యింకా నీ మొహం ఎలా చూడమంటావమ్మా?” అన్నట్లుగా వున్నాయి కన్ను అరమూతగా వున్న అన్నపూర్ణమ్మ చూపులు.

ఇంక తల్లి మొహంలోకి చూడ వీలు లేకుండా సత్య కళ్ళకి అడ్డొచ్చిందో కన్నీటి కెరటం! □